ఆదిలాబాద్ వార్త
మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్
మంగళవారం 2, జూన్ 2026



# ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

- ఏ గూడెంలో గుడిసె లేకుండా పక్కా ఇల్లు నిర్మిస్తాం
- ఇందిరమ్మ ఇల్లు పొందిన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పూర్తి చేయాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

**కెరమెరి, జూన్ 1, ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కొలాం కొఠారి గ్రామపంచాయతీలోని కొత్తగూడ గ్రామంలో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క) జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేకానంద, పార్లమెంటు సభ్యులు వేమ్ నరేందర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు, జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మీ, గ్రామ సర్పంచ్ మడావి సంపాబాయి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదివాసి బిడ్డలందరికీ ప్రభుత్వం నుంచి అమలు చేసే ప్రతి పథకాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతంగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి, ఆదివాసీల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఆదివాసీల జీవితాలలో వెలుగులు నింపుతామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 2లో..

# చిన్నారులను సంపూర్ణ నైపుణ్యాలతో తీర్చిదిద్దడంలో అంగన్వాడి కేంద్రాల పాత్ర కీలకం

**రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు**

**ఆసిఫాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:**



చిన్నారులను సంపూర్ణ నైపుణ్యాలతో తీర్చిదిద్దడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం4 లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా విచ్చేసిన రాష్ట్ర మంత్రులు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాల్లోనే పిల్లలను చేర్పించాలని సూచించారు. ప్రస్తుతం అంగన్వాడి కేంద్రాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆధునిక సౌకర్యాలతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేస్తున్నామని, పిల్లలకు అమ్మ ముద్ద పేరుతో అల్పాహారం అందించే పైలట్ ప్రాజెక్టుకు ఆదిలాబాద్ జిల్లాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న ఖాళీలను త్వరలో భర్తీ చేసి ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి వేతనాల పెంపు దిశగా కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు పిల్లలే నిజమైన ఆస్తి అని అన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలను ప్లే స్కూళ్లు, అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి మిగతా 2లో..



# గుడిసెలు లేని గూడెంను చూడాలి

- గుడిసె ఉన్న ప్రతీపేదవారికి ఇందిరమ్మ ఇల్లు
- కొలాం కొటారి నుంచి సామూహికంగా ఇందిరమ్మ గృహ ప్రవేశం కార్యక్రమం ప్రారంభం
- నూతనంగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ప్రభుత్వం ప్రతీ గింజను కొనుగోలు చేస్తుంది
- రైతులు అధైర్యపడవద్దు
- తుమ్మిడిహెట్టి నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలు చొరవ చూపాలి
- కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద భారీ భహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 1, ప్రభాతవార్త :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గూడెలలో, తండాలలో గుడిసెలేని ఇండ్లను చూడాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని, గుడిసె ఉన్న ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, సీతక్క, అధికారులు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత, సంబంధిత శాఖ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి కుమ్రం భీం జిల్లా కెరమెరి మండలం కొలాం కొటారి గూడెంలో నూతనంగా నిర్మించిన 25 ఇందిరమ్మ ఇండ్లను సామూహికంగా గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమం తొలత ఇక్కడి నుండే ప్రారంభించి శ్రీకారం చుట్టినట్లు సీఎం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదివరకే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని ఇందులో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉంటే ఆదివాసుల పటేల్ విన్నపాన్ని స్వీకరించి మరో 21వేల ఇందిరమ్మ ఇండ్లు ఆదివాసీలకు మిగతా 2లో..

# ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

(మొదటిపేజీ తరువాయి)

4 లక్షల 50 వేల ఇండ్లు అందించడం జరిగిందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ సమన్వయంతో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని గూడాలు, ఆదివాసి ప్రాంతాలలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు కేటాయించి అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏ గిరిజన గూడెంలో గుడిసె లేకుండా పక్క ఇండ్లు నిర్మిస్తామని, అర్హత గల ప్రతి ఒక్కరికి ఇల్లు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు 2వ విడత కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఇక్కడి నుండి ప్రారంభిస్తున్నామని, 1 లక్ష ఇండ్లు ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని, 2 లక్షల 50 వేల ఇండ్లతో 2వ విడత కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి అర్హత గల ప్రతి ఆదివాసి గిరిజనులకు ఇల్లు కేటాయించి నిర్మించుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళలను ఇంటి పెద్దగా గుర్తించి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్న బియ్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తూ స్వయం సహాయక సంఘాల మహిళల రుణ పరిమితిని 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను వివిధ వ్యాపార రంగాలలో భాగస్వాములను చేయడం జరుగుతుందని, మహిళలను బస్సులకు యజమానులను చేస్తూ రాష్ట్రంలో 1 వేయి బస్సులను కేటాయించడం జరిగిందని, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణలో మహిళలకు అవకాశం కల్పించి ఆర్థిక అభివృద్ధి దిశగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.







ఇల్లు రానివారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హత గల ప్రతి ఒక్కరికి అందించేందుకు కృషి చేస్తున్నామని, ఇందిరమ్మ ఇల్లు పొందిన వారు ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్య ఎంతో అవసరమని, ఆదివాసి గిరిజనులు తమ పిల్లలను తప్పకుండా చదివించుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని తెలిపారు. మహిళలు తమ సంపాదనను పొదుపు చేసుకోవాలని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను తెలుసుకొని సమకూర్చేందుకు ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందని తెలిపారు. అర్హత గల ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేసి గూడు కల్పించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో మారుమూల గ్రామానికి వచ్చి ఇందిరమ్మ ఇండ్లు 2వ విడత కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసి పి వి టి జి గూడాలలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. కూడు గూడు గుడ్డ అందించడంతో పాటు పిల్లలందరికి సరైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు కేటాయించడం జరిగిందని, జిల్లాలో జనాభా ప్రాతిపదికన అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొలాం కొరారి గ్రామపంచాయతీలోని కొత్తగూడ గ్రామంలో గల సిడం కన్నీబాయి, టేకం పగ్గుబాయి, ఆత్రం పోచుబాయి లకు చెందిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశం చేశారు. అనంతరం గ్రామంలో షియర్ వాల్ సాంకేతికతతో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని గూడెంను చూడాలి

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేసినట్లు తెలిపారు. ఇవే కాకుండా ఇక నుంచి ప్రతీ గూడెం, తండాలలో ఐటీడీఏ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి గుడిసె ఉన్న ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి తీరుతామని ప్రత్యేకంగా తండాలు, గూడెంలలోని ఆదివాసుల కోసం మరో 30 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. రెండో విడతలో భాగంగా నూతనంగా 2.5 లక్షల ఇండ్లు మంజూరు చేస్తూ వేదిక నుండి ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కాగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గుండి, అనర్‌పల్లి ప్రాజెక్టుల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

### తుమ్మిడిహెట్టి బ్యారేజికి మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదు

గత ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం ప్రాజెక్టు కావడంతో లక్షల కోట్ల ప్రజాధనం వృధా అవడం జరిగిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎలాగైనా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి నిర్మాణం చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని ముంపుకు గురవుతున్న భూమి సేకరణకు మహారాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖ రాసినప్పటికిని దేవేంద్ర పడ్నావిస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఎం అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే హరీష్‌బాబు చొరవ చూపి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి చర్చల ద్వారా పరిష్కారం అయ్యే విధంగా చూసి ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని అన్నారు. మహారాష్ట్రలోని ముంపు ప్రాంతంలో సుమారు 2 వేల ఎకరాలు భూ సేకరణ చేపట్టి మహారాష్ట్ర ప్రభుత్వం వాటి విలువ ఎంతో ప్రకటిస్తే అంత చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు.

### రైతులు అధైర్యపడవద్దు.. ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

రాష్ట్రంలో రైతులు ఎవరు ధాన్యం కొనుగోలు విషయంలో అధైర్యపడవద్దని, తడిసి ప్రతీ గింజను సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రజా ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 75లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం 20 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం సిద్ధంగా ఉన్నట్లు, ఇవే కాకుండా జొన్నలు, పొద్దుతిరుగుడు పువ్వు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. కానీ కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదని, మద్దతు ధర సైతం ప్రకటించడం లేదని కేంద్ర ప్రభుత్వం ఇదే ధోరణితో కొనసాగితే జూన్ 15 తర్వాత కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డి, పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కోవలక్ష్మి, హరీష్‌బాబు, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపి సోయం బాబురావు, నాయకులు ఆత్రం సక్కు, పురాణం సతీష్, వేణుగోపాల చారి, అజ్మీర రేఖ, శ్యామ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులను సంపూర్ణ నైపుణ్యాలతో తీర్చిదిద్దడంలో అంగన్వాడి కేంద్రాల పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి)

మంచి అలవాట్లు నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల గిరిజన కుటుంబాలకు చెందిన సుమారు వెయ్యి మందికి హైదరాబాద్ నగరాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. ఎన్నడూ హైదరాబాద్ చూడని గిరిజనులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడంతో పాటు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసి చిన్నారులను ఆశీర్వదించారు. జిల్లా కలెక్టర్ హరిత అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, అంగన్వాడి టీచర్స్ తో మాట్లాడారు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్వేత శుక్ల, గోలేటి సర్పంచ్ అజ్మీరా బాబురావు, ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జి శ్యాం నాయక్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ ఇరుకుల్ల మంగ, తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేయించిన సర్పంచ్

**సారంగాపూర్, జూన్ 01, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండలంలోని కౌట్ల (బీ) గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు చాకలి సుశీల సోమవారం గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బల్గురి అజయ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సర్పంచ్ స్వయంగా హాజరై లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారు చాకలి సుశీల మాట్లాడుతూ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యుడు సాయి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఈదురుగాలులతో కూడిన రాళ్ల వర్షం

### - తడిసిన ధాన్యపు బస్తాలు

**సారంగాపూర్, జూన్ 01, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన అకాల రాళ్ల వర్షం కురిసింది. ఈ హఠాత్ పరిణామంతో కొన్నిచోట్ల పెద్ద పెద్ద చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ముఖ్యంగా ఈ అకాల వర్షం వల్ల మార్కెట్ యార్డుల్లో కొనుగోలుకు సిద్ధంగా ఉంచిన, అలాగే ఇప్పటికే కొనుగోలు చేసిన వరి, మొక్కజొన్న, జొన్న ధాన్యపు బస్తాలు భారీగా తడిసిపోయాయి. లారీలలో లోడ్ చేస్తున్న ధాన్యంపై రైతులు, కార్మికులు టార్పాలిన్లు కప్పినప్పటికీ తీవ్రమైన గాలుల ధాటికి అవి కొట్టుకుపోవడంతో ఫలితం లేకుండా పోయింది. ధాన్యపు బస్తాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మార్కెట్ యార్డుల్లో కాంటా (తూకం) పూర్తయిన మొక్కజొన్న, వరి, జొన్న ధాన్యపు బస్తాలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు, గోదాములకు తరలించాలని రైతులు వేడుకుంటున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యంపై ఇప్పటికే ఎన్నో ధర్నాలు చేశామని, ఇప్పుడు వానాకాలం కూడా ప్రారంభం అవుతున్నందున అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్బీఐ బ్యాంకు ఉద్యోగుల చేతివాటం..

✧ 20 కోట్ల రూపాయల విలువైన బంగారం బ్యాంకు సిబ్బందికి తెలియకుండానే బయటికి వెళ్లిందా

✧ 400 మంది గోల్డ్ లోన్ బాధితుల నడ్డి విరిచే కుట్ర చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

✧ ఎస్బీఐ బ్యాంకు సిబ్బందిపై మండిపడ్డ భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

✧ గోల్డ్ లోన్ బాధితుల నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన భాజపా నాయకులు

చెన్నూరు, జూన్ 1, ప్రభాతవార్త




ఎస్బీఐ బ్యాంకు సిబ్బంది చోరీ చేసిన బంగారాన్ని పోలీసులు రికవరీ చేసి అప్పగించిన తర్వాత కూడా ఆ బంగారం బాధితులకు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలోని ఎస్బీఐ 2 బ్యాంకు ముందు నిరాహార దీక్ష చేస్తున్న గోల్డ్ లోన్ బాధితులకు భాజపా నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ గోల్డ్ లోనే బాధితులు తమ కుటుంబ అవసరాల కోసం, ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారులు నేడు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారాని, దాదాపు 20 కోట్ల విలువైన బంగారం బ్యాంకు నుంచి తరలిపోతా ఉంటే బ్యాంకు అధికారుల నిఘా వ్యవస్థ, ఆడిటింగ్ వ్యవస్థ ఎక్కడ పోయిందని ఆయన ప్రశ్నించారు. వినియోగదారుల భద్రత కన్నా బ్యాంకు అధికారులు తమ ఉద్యోగాలు రక్షించుకోవడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు లోన్ చెల్లించిన వారికి సుమారు 20 శాతం కోత విధించి బంగారం విలువ చెల్లిస్తామనడం ఎంతవరకు సమంజసమని అన్నారు. బ్యాంకు అధికారులు తక్షణమే లోను చెల్లించిన వారికి 100 శాతం ప్రస్తుతం బంగారం విలువ మొత్తాన్ని చెల్లించాలని, వారు కుదువ పెట్టిన ఆభరణాన్ని తక్షణం అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంక్ అధికారులు తమ చిన్న స్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకొని వారు చేతులు దులుపుకున్నారని, ఇప్పటికైనా సీబీఐ విచారణ జరిపించి బాధ్యులైన ప్రతి ఒక్కరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు పట్టణ అధ్యక్షులు తుమ్మ శ్రీపాల్, కోటపల్లి మండల పార్టీ అధ్యక్షులు పెద్దింటి స్వప్న పున్నమి చంద్, తదితరులు పాల్గొన్నారు.



చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే

## ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా, జూన్ 01, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు చీరలను పంపిణీ చేసి, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళా సాధికారతకు దోహదపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలనేదే ప్రభుత్వ ఆకాంక్ష అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## భద్రతే ప్రథమం.. సింగరేణి కార్మికులు సేఫ్టీ నిబంధనలు పాటించాలి: జీఎం రాధాకృష్ణ

### – ప్రత్యేక భద్రతా అవగాహన వారోత్సవాలకు ఘన ప్రారంభం

మందమర్రి, జూన్ 1, ప్రభాతవార్త

సింగరేణి సంస్థలో ప్రమాదరహిత పని వాతావరణం కల్పించేందుకు కార్పొరేట్ సేఫ్టీ విభాగం ఆదేశాల మేరకు మందమర్రి ఏరియాలో ప్రత్యేక భద్రతా అవగాహన వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 1 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ కేకేఓసీపీ ప్రాజెక్టును సందర్శించి కార్మికులకు భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓబీ ఆఫ్‌లోడింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన జీఎం ఎన్. రాధాకృష్ణ, ప్రతి ఉద్యోగి సంస్థ నిర్దేశించిన భద్రతా ప్రమాణాలు, సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను విధిగా పాటించాలని సూచించారు. భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. పని ప్రదేశంలో ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండడంతో పాటు వ్యక్తిగత రక్షణ పరికరాలు పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. భారీ యంత్రాల నిర్వహణ సమయంలో నిర్దేశిత భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, సురక్షితమైన పని వాతావరణం ఏర్పాటులో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని జీఎం పిలుపునిచ్చారు. భద్రతా సంస్కృతి సంస్థలో మరింత బలోపేతం కావాలంటే అధికారులు, కార్మికులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక భద్రతా అవగాహన వారోత్సవాల సందర్భంగా ఏరియాలోని అన్ని గనులు, ప్రాజెక్టులు, విభాగాలలో భద్రతా సదస్సులు, అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, మేనేజర్ రామరాజు, ఇంచార్జి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ పైడయ్య, ఎక్స్‌ప్రెస్‌వే జీఎం దినేష్ చౌదరి, ఇతర అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జూన్ 3న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ధర్నా

### - డిపెండెంట్ ఉద్యోగ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని డిమాండ్

నస్పూర్, జూన్ 1, ప్రభాతవార్త



సింగరేణిలో డిపెండెంట్లకు తక్షణమే ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3న ఉదయం 10 గంటలకు శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచి కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కారుణ్య ప్రాతిపదికన అనర్హులుగా మారిన ఉద్యోగుల పిల్లలు 400 మందికి పైగా గత రెండేళ్లుగా నియామక ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాల సమస్యలపై సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ముందు ధర్నాలు చేపట్టి యాజమాన్యానికి మెమోరాండం అందజేయాలని ఏఐటీయూసీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద జరిగే నిరసన ప్రదర్శనలో డిపెండెంట్లు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బాజీ సైదా పిలుపునిచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు, గ్రామస్థులు

## రైస్ మిల్లుకు ఎన్‌ఓసీ ఇవ్వొద్దంటూ వార్డుమెంబర్ల వినతి

దిలావర్‌పూర్, జూన్ 01, ప్రభాతవార్త:

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద నిర్మాణం చేపట్టిన రైస్ మిల్లుకు ఎలాంటి ఎన్‌ఓసీ (నిరాక్షేపణ పత్రం) మంజూరు చేయవద్దని కోరుతూ సోమవారం వార్డు సభ్యులు, గ్రామస్థులు ఎమ్మార్వో, ఎంపీడీవో, ఈవోలకు వినతిపత్రం అందజేశారు. జూనియర్ కళాశాల సమీపంలో, ప్రధాన రహదారికి అతి దగ్గరగా ఈ మిల్లు నిర్మాణం చేపట్టారని వారు పేర్కొన్నారు. రైస్ మిల్లు కార్యకలాపాల వల్ల వెలువడే వ్యర్థాలు, పొగ వల్ల విద్యార్థులు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సమీపంలో వేదత్రాయ డిగ్రీ కళాశాల, మార్కండేయ మందిరం, నివాస గృహాలు ఉండటంతో దుమ్ము, శబ్ద కాలుష్యం, రవాణా సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు సమగ్రంగా పరిశీలించి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని, మిల్లుకు అనుమతులు నిరాకరించాలని వార్డు సభ్యులు, గ్రామస్థులు కోరారు.

## 14 రోజుల నిరవధిక సమ్మె విరమించిన వివోఏలు

దిలావర్‌పూర్, జూన్ 01, ప్రభాతవార్త



దిలావర్‌పూర్ మండలంలోని వివోఏలు చేపట్టిన 14 రోజుల నిరవధిక సమ్మెకు ముగింపు పలికారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత రెండు వారాలుగా ఆందోళన కొనసాగించిన వివోఏలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రావడంతో సమ్మెను విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర వివోఏల ప్రత్యేక ప్రతినిధి బృందం ఆదివారం రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి తమ సమస్యలు, డిమాండ్లను వివరించి పరిష్కరించాలని కోరింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఐకేపీ ఏపీఎం బోస్‌కు వినతిపత్రం అందజేసిన వివోఏలు, తమ నిరవధిక సమ్మెను విరమించుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని కోరుతూ, సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వివోఏల సమ్మె విరమణతో మండలంలోని స్వయం సహాయక సంఘాల సంబంధిత కార్యకలాపాలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి.

## లక్షెట్టిపేట ఇంచార్జి ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

లక్షెట్టిపేట, జూన్ 01, ప్రభాతవార్త



లక్షెట్టిపేట మండల ఇన్చార్జి ఎంపీడీవోగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం లక్షెట్టిపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎంపీడీవో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆమె స్థానంలో ప్రసాద్ ఇంచార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులను, అధికారులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## పిడుగుపాటుకు మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, జూన్ 1, ప్రభాతవార్త :

ఆసిఫాబాద్ మండలంలోని కౌటగూడ గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి జరిగిన తీరని నష్టంపై విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కాగజ్‌నగర్ నుంచి భారీగా తరలిన ప్రజలు

### - వార్డు నెం.25 నుంచి ఉత్సాహంగా బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభను విజయవంతం చేయడానికి కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నెం. 25 నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించిన ముఖ్యమంత్రి సభకు హాజరయ్యేందుకు మొత్తం ఆరు బస్సులను ఏర్పాటు చేసి ప్రజలను పంపించారు. ఈ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు వెళ్లే ముందు కార్యకర్తలు, నాయకులు కలిసి బస్సులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినేందుకు ప్రజలు ఉత్సాహంగా ముందుకు వచ్చారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గం సూరజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్యమంత్రి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సీఎం సభను విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా భావించి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు. సభ విజయవంతం కావాలని ఆకాంక్షి స్తూ నాయకులు ముఖ్యమంత్రికి తమ మద్దతు తెలిపారు.



వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ ఆధ్వర్యంలో సభకు బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు

# సిఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### * మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, జూన్ 01, ప్రభాతవార్త



రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, రైస్ మిల్లుల నిర్వహకులు సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని శ్రీరామ రైస్ మిల్ ను మండల తహసీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ నూతన డీఆర్ఓ రాథోడ్ రమేష్

### - కలెక్టర్‌తో మర్యాదపూర్వక భేటీ

నిర్మల్, జూన్ 01, ప్రభాతవార్త:



నిర్మల్ జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ రమేష్ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌ను కలిసిన రాథోడ్ రమేష్, పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ విధులకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా నూతన డీఆర్ఓకు అభినందనలు తెలిపారు. జిల్లాలో రెవెన్యూ పరిపాలనను మరింత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నూతన డీఆర్ఓగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని, కలెక్టర్ సూచనల మేరకు జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని రాథోడ్ రమేష్ పేర్కొన్నారు.



## దిలావర్‌పూర్‌లో ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో నాకాబందీ తనిఖీలు

దిలావర్‌పూర్, జూన్ 01, ప్రభాతవార్త:

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ముమ్మరంగా నాకాబందీ (వాహనాల తనిఖీలు) నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పరిసర ప్రాంతాల గుండా వెళ్లే వాహనాలను ఆపి ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ వినియోగం తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన పలు వాహనాలను నిలిపివేసి, వాటి యజమానుల పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రవీందర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణ సమయాల్లో అవసరమైన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించి, పత్రాలు లేకుండా నడుపుతున్న పలు వాహనాలకు జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్సై రవీందర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్, ఏఈఓలను సన్మానించిన ఎంపీడీవో, సర్పంచ్

సారంగాపూర్, జూన్ 01, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని దని గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా సేవలు అందించి సోమవారం పదవీ విరమణ చేసిన రమాదేవికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘన వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీకాంత్, గ్రామ సర్పంచ్ బండి పోతన్న కలిసి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా గ్రామంలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఏఈఓ)గా పనిచేసి బదిలీపై వెళ్తున్న లక్ష్మిని కూడా సర్పంచ్, గ్రామ పెద్దలు శాలువా కప్పి మెమెంటోతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి పోతన్న మాట్లాడుతూ దని గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తూ చిన్న పిల్లలకు, గర్భిణులకు నిరంతరం పౌష్టికాహారాన్ని అందిస్తూ రమాదేవి ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. అలాగే గ్రామంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతులకు అవగాహన కల్పించడంలో ఏఈఓ లక్ష్మి చేసిన కృషి అభినందనీయమని పేర్కొంటూ వారిద్దరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జెడ్పీ సీఈవోగా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

నిర్మల్, జూన్ 01, ప్రభాతవార్త:



జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు సోమవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో)గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. పలువురు ఉద్యోగులు శాలువాలతో సత్కరించి, పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాలనను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామీణ స్థాయిలో ప్రతి అర్హుడికి అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. సిబ్బంది సమన్వయంతో, సహకారంతో జడ్పీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ డి. శంకర్, సూపరింటెండెంట్ ఆర్. పోశెట్టి, సీనియర్ అసిస్టెంట్ షాహిద్ అహ్మద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రావిర్భావ వేడుకలు ఘనంగా జరగాలి

## పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, జూన్ 01, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో అత్యంత ఘనంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని, అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జూన్ 2న జరగనున్న రాష్ట్రావిర్భావ వేడుకల నేపథ్యంలో సోమవారం సాయంత్రం కలెక్టర్ భవేష్ మిశ్రా కలెక్టరేట్ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన వేదిక అలంకరణ, వీఐపీలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రోటోకాల్ ప్రకారం కుర్చీల ఏర్పాటు, సౌండ్ సిస్టమ్, లైటింగ్, షామియానాలు, జాతీయ జెండా ఆవిష్కరణ స్థలం, వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాటును ఆయన స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిపోయిన చిన్న చిన్న పనులను సైతం రాత్రిలోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చే స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్ ను కూడా పరిశీలించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రావిర్భావ ఏర్పాట్ల పరిశీలన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ భవేష్ మిశ్రా ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపల్ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పుష్కరాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. బాసర, కందకుర్తి తదితర పుష్కర ఘాట్ల వద్ద శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు, మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. ఘాట్లకు వెళ్లే రహదారులను బాగు చేయడం, బ్యారికేడింగ్, మహిళలకు ప్రత్యేక చేంజింగ్ రూమ్‌లు, మరుగుదొడ్లు, స్నానపు ఘాట్ల వద్ద భద్రతా ఏర్పాట్లు, తాగునీటి ట్యాంకులు, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, ఆర్అండ్‌బీ ఈఈ, పంచాయతీరాజ్ ఈఈ, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





శాలువాతో సత్కరిస్తున్న సర్పంచ్ కునేరు భూమన్న

## గ్రామ కార్యదర్శి కృష్ణకు వీడ్కోలు సన్మానం

**సారంగాపూర్, జూన్ 01, ప్రభాతవార్త:**

సారంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనకు సోమవారం ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా ఆయన మొదటిసారి నాగపూర్ తండాలో మూడు సంవత్సరాలు, అనంతరం సారంగాపూర్ గ్రామంలో ఒక సంవత్సరం పాటు సేవలందించి, ప్రస్తుతం బాసర మండలంలోని కిరుగులు గ్రామానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కునేరు భూమన్న పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ సారంగాపూర్ గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్ నిర్మించి తడి చెత్త, పొడి చెత్త నిర్వహణను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా జిల్లా స్థాయి ఉత్తమ కార్యదర్శి పురస్కారం దక్కడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనుల్లో చురుగ్గా పాల్గొన్నానని తెలిపారు. నిరంతరం పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. తమ విధులకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కారోబార్ ఉమామహేష్, ఆశన్న, వార్డు సభ్యులు మల్లేష్, సత్యనారాయణ, సాయి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ముందస్తు ప్రణాళికలు

### - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, జూన్ 1, ప్రభాతవార్త**

యాజమాన్యం నిర్దేశించిన 64 లక్షల 30 వేల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ముందస్తు ప్రణాళికలతో కృషి చేస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మే నెలలో ఏరియాలోని గనుల ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. మే నెల లక్ష్యం 5,47,500 టన్నులు కాగా, 3,16,447 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి 58 శాతం ప్రగతి సాధించినట్లు వివరించారు. భూగర్భ గనులు 96 శాతం ఉత్పత్తి సాధించగా, ప్రైవేట్ కాంట్రాక్ట్ సమస్యల వల్ల ఓపెన్ కాస్ట్ గనులు 47 శాతానికే పరిమితమయ్యాయన్నారు. జూన్ 3 నుండి కొత్త కాంట్రాక్ట్ పనులు ప్రారంభం కానుండటంతో ఓసీల్లో ఉత్పత్తి పెరగనుందని, ఐకే ఓసీ టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, సీనియర్ పీఓ ఎస్ . సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి సభకు భారీగా తరలిన చింతగూడ గ్రామ ప్రజలు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్వహించిన భారీ బహిరంగ సభకు చింతగూడ గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా సభలో పాల్గొని ముఖ్యమంత్రికి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా ప్రజలను సభా ప్రాంగణానికి తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపారు.సభలో పాల్గొన్న ప్రజలు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వాగతిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి మద్దతు ప్రకటించారు. చింతగూడ గ్రామం నుంచి మహిళలు, రైతులు, యువత, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ

**ఉట్నూర్, జూన్ 1,ప్రభాతవార్త :**

లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ప్రజలకు మజ్జిగ (బటర్ మిల్క్) పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని లోక ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మజ చేపట్టారు.సమాజసేవ అనేది కేవలం మాటల్లో కాకుండా చేతల్లోనూ ప్రతిఫలించాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు ప్రారంభించారు. ప్రజలకు సేవ చేయాలనే లోక ఫౌండేషన్ యొక్క సామాజిక బాధ్యతను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 50 మంది అధికారులు, ఉద్యోగులతో పాటు ప్రజావాణికి విచ్చేసిన 300 మంది గిరిజన దరఖాస్తుదారులు మజ్జిగను స్వీకరించారు.ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో చిన్న సహాయం కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, భవిష్యత్తులో కూడా లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.ప్రజల సంక్షేమం, ఆరోగ్యం మరియు సామాజిక బాధ్యతను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజలు లోక ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను అభినందించారు.



## ఘనంగా ఇందిరమ్మ ఇండ్లలో గృహప్రవేశ కార్యక్రమం

**దిలావర్‌పూర్, జూన్ 01, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లలో గృహప్రవేశ కార్యక్రమాన్ని సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) అరుణ రాణి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరై, లబ్ధిదారులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులు తమ నూతన గృహాల్లో సాంప్రదాయబద్ధంగా గృహప్రవేశం చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అరుణ రాణి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తూ గృహసౌకర్యం కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందుతుందని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల ఆర్థిక, సామాజిక ప్రగతికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కార్మికులు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

### - జాతీయ రహదారిపై కార్మికుల.. ధర్నా - సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం

**తాండూర్, జూన్ 1, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సిఐటియు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారం డిమాండ్ చేశారు. మండలంలోని ఐబి కేంద్రంలో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలు, అభద్రత భావంతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని , బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని, నెలకు రూ.26 వేతనం చెల్లించాలని, ఇవ్వాలి. సంవత్సరానికి ఒక్క కార్మికునికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, బెల్లం, నూనె, సంవత్సరానికి రెండు జతల చెప్పులు, సబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, మొగిలి, హక్కు, అక్బర్, నందిపేట వెంకటి, ఇప్ప రామయ్య, ఇప్పదురుగు, ఇప్ప ఎల్లమ్మ, ఇప్ప సుజాత, కాజీపేట కమల, రామగిరి రాధా, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు, నాయకులు